క్లుప్తంగా

ఎంపీకి సర్పంచ్ వినతి



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ కరుణాకర్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ సర్పంచ్ బింగి కరుణాకర్ శనివారం కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిశారు. ఈసందర్భంగా గ్రామంలో శ్మశాన వాటిక, గ్రామ పంచాయతీ భవనం, ఓపెన్ జిమ్ తదితర అభివృద్ధి పనులకు ఎంపీ కోట నుంచి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎడవెల్లి కొండాల్‌రెడ్డి

హుజూరాబాద్: దివంగత మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితెల రాజేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండాల్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 24న బీఆర్‌ఎస్ యువ నాయకుడు వొడితెల ప్రణవ్ అధ్యక్షతన పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీ కాంతరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు గండు ప్రశాంత్ యాదవ్, సింగపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు ఈజ్జిగిరి కుమార్, రాజ్‌కుమార్ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ



రాజ్‌కుమార్



తోట తిరుపతి

ఇల్లందకుంట: ఇల్లందకుంట ఎస్సైగా నాంపెల్లి రాజ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎస్సైగా విధులు నిర్వహించిన చంద్రశేఖర్ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఎస్సైకి పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

రామడుగు: రామడుగు ఎస్సైగా తోట తిరుపతి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమేరకు కరీంనగర్ సీపీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై తిరుపతి బుధవారం విధుల్లో చేరనున్నారని సమాచారం.

దోమలు వృద్ధి.. వ్యాధులు వ్యాప్తి

- సమ్మెలో జీపీ కార్మికులు
- ఇబ్బందుల్లో ప్రజలు
- గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తం



మురుగుకాలువలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: వరుణుడి కరుణతో అన్నివర్గాలకు ఉపశమనం లభించింది. వారం రోజులుగా వర్షాలు కురవడంతో పంటల సాగు పెరిగింది. వర్షాలు పడటం ఓ వైపు ఆనందాన్ని కలిగిస్తున్నా.. వ్యాధుల వ్యాప్తికి కారణం ఆందోళన కలిగిస్తోంది. నీరు కలుషితమవ్వడం, ఇళ్ల, పరిసరాలు, పాఠశాలల ఆవరణలో మురుగునీరు నిలుస్తోంది. పారిశుధ్యం లోపించటం, దోమలు వృద్ధి చెందటం వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తమైంది. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో వ్యాధుల వ్యాప్తి పెరుగుతుంది. మరోవైపు ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

జీతం మూరేడు... పని బారేడు..

ప్రస్తుతం పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.8,500 వేతనం చెల్లిస్తోంది. అది గ్రామ పంచాయతీల నుంచే నిధుల లభ్యతను బట్టి వేతనాల చెల్లింపుల్లో వెనుకా ముందు అవుతోంది. అందరిని మల్టీపర్పస్ కార్మికులుగా గుర్తించారు. పంచాయతీక కార్మికులు ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్లు, వాటర‌మెన్, ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నారు. మురుగుకాలువల్లో పూడిక తీత, వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, పాగింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి తిరుగుతూ చెత్తాచెదారం సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఇప్పుడు వీరు సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు..

జీవో నంబర్ 51 సవరించాలి, గ్రామ పంచాయతీ నుంచి కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలి. మల్టీపర్పస్ విధానం ఎత్తేయాలి. కార్మికులు, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. రూ.19 వేలు వేతనం, రూ.10 లక్షల ఆరోగ్య, ప్రమాద బీమా అమలు చేయాలి. ఏటా అందించే ఏకరూప దుస్తులు, చెప్పులు, సబ్బులు, నూనెలకు బదులు డబ్బులు అలవెన్సు రూపంలో అందజేయాలి. విధి నిర్వహణలో మృతి చెందితే రూ.పది లక్షల పరిహారం అందించాలి. పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యూటి సౌకర్యాలను కల్పించాలి. ట్రాక్టర్ డ్రైవర్లకు లైసెన్సుల జారీతో పాటు ప్రమాదంలో మృతిచెందితే అంత్యక్రియలకు తక్షణ సాయం రూ.30 వేలు ఇవ్వాలి. ఉన్నతాధికారుల వేధింపులను అరికట్టాలి.

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

జీపీ కార్మికుల సేవలకు అంతరాయం ఏర్పడటంతో పారిశుధ్యం లోపించింది. ఫలితంగా ఇళ్ల పరిసరాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. అంతే కాకుండా దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా ప్రజలు డెంగీ, మలేరియా, మెదడు వాపు, ఫ్లూ, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కార్మికుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చాలీచాలని కూలీ



గ్రామంలో పారిశుధ్య పనులకు ఉదయం 4 గంటలకు ఇంటి నుంచి బయటికి వస్తే మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వెళ్లి భోజనం చేసి మిగిలిన పనులు చేయాలి. రూ.8,500 జీతం పెరిగిన నిత్యావసర ధరలకుఏమాత్రం సరిపోవడం లేదు. ప్రభుత్వం మా సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

– నిజానపురం సంపత్, పారిశుధ్య కార్మికుడు, చెల్పూర్

డిమాండ్లు నెరవేర్చాలి



గ్రామంలో టైంతో సంబంధం లేకుండా పారిశుధ్య పనులు చేస్తున్నాం. ప్రస్తుతం చెల్లిస్తున్న జీతం సరిపోవడం లేదు. పనిభారం పెరుగుతోంది, పెరిగిన నిత్యావసర ధరలకు జీతం డబ్బులు సరిపోక అప్పు చేయాల్సి వస్తోంది. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకుంటూ వస్తున్నాం.

– కొలిపాక ఎల్లయ్య, పారిశుధ్య కార్మికుడు, పెద్దపాపయ్యపల్లి

ఇబ్బందిగా ఉంది



పంచాయతీ కార్మికుల సమ్మె మూలంగా గ్రామంలో పారిశుధ్య నిర్వహణ ఇబ్బందిగా మారింది. మురుగు కాలువల్లో సిల్ట్ పెరిగి దుర్వాసన వెదజల్లుతుంది.ప్రైవేట్ వర్కర్స్‌తో పనిచేయించాలంటే జీపీ నిధులు లేక ఇబ్బంది పడుతున్నాం. జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

– బింగి కరుణాకర్, సర్పంచ్, రంగాపూర్

రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం



నిరసన చేస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏకకాలంలో రుణమాఫీ అమలుచేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని, బీసీలను ప్రభుత్వం మభ్యపెడుతోందని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. అర్హులకు రేషన్‌కార్డులు, పెన్షన్లు అందించాలని కోరారు. మండలంలో కనీస వైద్య, రవాణా సౌకర్యం లేదని, ఉన్నత విద్యకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి గర్శకుర్తి శ్రీనివాస్, యువజన సంఘాల అధ్యక్షుడు మొలుగూరి అంజనేయులు, నాయకులు కూన మల్లయ్య, బోయిని మల్లయ్య, సామ వెంకట్‌రెడ్డి, సారవు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెస్‌చార్జీల పెంపుపై ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షం

శంకరపట్నం: సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచడంపై ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మూడో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంపు ఊరటినిస్తుందన్నారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలను ఏఐవైఎఫ్ సర్వేలు, యాత్రలు చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. ప్రభుత్వం విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారంతో 18వ రోజుకు చేరుకుంది. చెవిలో పువ్వుతో కార్మికుల నిరసన తెలిపారు. కనీస వేతనం రూ. 19,500 చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీవో 60 అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని, డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి రవీందర్ జీపీ కార్మికులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో జీపీ సిబ్బంది చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమస్యలు పరిష్కరించాలని కార్మికులు నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని మండల అధ్యక్షుడు సారయ్య అన్నారు.

ఇల్లందకుంట: గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేపట్టిన దీక్ష కొనసాగుతోంది. ఈసందర్భంగా కార్మికులు ఒంటికాలిపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు చేపడతామని కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, బాబు, సంపత్, రాజేందర్, కుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



కేశవపట్నంలో నిరసన తెపుతున్న కార్మికులు

నుస్తులాపూర్ సందర్శన



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ప్రతినిధులు, తదితరులు

తిమ్మాపూర్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా మండలంలోని నుస్తులాపూర్ గ్రామాన్ని ఎప్సన్ కంపెనీ కేంద్ర బృందం ప్రతినిధులు కిషోర్, రాకేశ్ కుమార్ ఆదివారం సందర్శించారు. గ్రామంలో ంకుడుగుంతలు, మరుగుదొడ్ల పనితీరును పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ విధానం, పారిశుధ్యం వంటి వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, ఇంకుడుగుంతల పనితీరుపై సర్పంచ్ రావుల రమేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, అడిషనల్ డీఆర్డీఓ సంధ్యారాణి, ఎంపీఓ కిరణ్‌కుమార్, ఏపీవో లలితకుమారి, యూనిసెఫ్ మండల కోఆర్డినేటర్ రవీందర్, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు హరీశ్, శేఖర్, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

సైదాపూర్: మండలంలోని దుద్దెనపల్లిలో కేంద్ర బృందం సభ్యుడు వెంకటేశ్ పర్యటించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రం, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం పనుల నిర్వహణను పరిశీలించారు. వర్మి కంపోస్టు ఎరువుల తయారీ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ యుగేందర్ రెడ్డి, ఎంపీటీసీ చాడ చైతన్య, ఎంపీడీవో పద్మావతి, ఏపీఎం కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించొద్దు



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

హుజూరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, మహిళ, యువజన, విద్యార్థి వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ కార్పొరేట్లకు ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా ఇచ్చేస్తుందన్నారు. దేశభక్తి ముసుగులో కులమతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని, మూడు నెలలుగా మణిపూర్‌లో మారణ హోమం జరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఇరవై రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకు సిబ్బంది రైతుల నుంచి వడ్డీలు వసూలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జోన్ కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, జోన్ కమిటీ సభ్యులు గుండేటి వాసుదేవ్, నాయకులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చివేయిస్తున్న బీజేపీ నాయకులు

గన్నేరువరం: గుండ్లపల్లి – గునుకులకొండాపూర్ గ్రామాల మధ్య రోడ్డు బురదమయమై గుంతలు ఏర్పడటంతో బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, నాయకులు ఆదివారం మట్టితో గుంతలు పూడ్చివేయించారు. ఈసందర్భంగా మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, డబుల్ రోడ్డు నిర్మాణానికి పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టినా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గాదె వెంకన్న, గడ్డం సుమిత్‌రెడ్డి, బూట్ల జగన్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అటికం రామచంద్రం, తాళ్లపల్లి పర్శరాంగౌడ్, రాజ్‌కుమార్, కుర్ర హరీశ్, రవిగౌడ్, సురేందర్‌రెడ్డి, మధు, ప్రవీణ్, వంశీ పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టాలని కాంగ్రెస్ ధర్నా



రోడ్డుపై బైటాయించి ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గునుకులకొండాపూర్ వరకు గుంతలమయమైన రోడ్డుకు వెంటనే మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గునుకులకొండాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వైఎస్సార్‌టీపీ, సీపీఐ(ఎంఎల్) నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ నాయకుడు సంపతి ఉదయ్ మాట్లాడుతూ.. గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేసిన రూ. 71 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధ్వాన రోడ్డుపై ప్రయాణించడానికి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, పనులు ఎందుకు చేపట్టడం లేదని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ప్రశ్నించారు. పనుల కోసం జూన్ 19న టెండర్లు నిర్వహిస్తామన్నా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట నిలుపుకోవాలని కోవాలని కోరారు. గుంతలమయమైన రోడ్డుకు మూడు రోజుల్లో మరమ్మతు చేపట్టాలని లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సునీల్, సీపీఐ ఎంఎల్ నాయకులు బామండ్ల ర వీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు రవీందర్, పరిపూర్ణాచారి, ఎస్సీ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షులు చందర్, శ్రీధర్‌రెడ్డి, కనుకయ్య, శంకర్, తిరుపతి, రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా ముందుకువెళ్లాలి

హుజూరాబాద్: పట్టణంలోని ఉస్మాన్ సేట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన టీటీడీపీ ఆఫీస్‌ను ఆదివారం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జోత్స్న ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు వెళ్లాలని సూచించారు. పార్టీ పూర్వ వైభవానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామెర సత్యం, ఆగయ్య, పర్శ రాములు, ఫయాజ్, రామగిరి అంకుష్ తదితరులున్నారు.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

చిగురుమామిడి: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించనున్నామని పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తెలిపారు. ఆదివారం చిగురుమామిడిలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, అసెంబ్లీ ఎన్నికలు మరో ఐదు నెలల్లో రానున్న దృష్ట్యా కార్యకర్తలు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను మూడోసారి గెలిపించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఐటీ శాఖమంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు.మావేశంలో పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ లాంటి దుష్టశక్తులు ఎన్ని వచ్చినా రైతులను కాపాడుకునే నాయకుడు సీఎం కేసీఆర్ అని ఒక్క చాన్స్ ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. వీణవంక మండలం రెడ్డిపల్లి క్లస్టర్ రైతువేదికలో ఆయా గ్రామాల రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సర్వేల్లో హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డి గెలుస్తాడని తేలడంతో కాంగ్రెస్, బీజేపీలు జీర్ణించుకోలేకపోతున్నాయని, సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల కరెంట్ అందిస్తున్నది సీఎం కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, మధుకర్‌రెడ్డి, జున్నుతుల మల్లారెడ్డి, నరసింహారెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, చెక్కబండి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల సంపత్, వీరయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపే గ్రామానికి చెందిన ఎ.మల్లేశం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్సకు డబ్బులు లేకపోవడంతో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆశ్రయించాడు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి చికిత్స కోసం మల్లేశం కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఎల్‌వోసీ కాపీని ఆదివానం అందించారు. ఈసందర్భంగా వారు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రవిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.